క్లుప్తంగా

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

సీతానగరం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు తరచూ చేపట్టాలని ఈఓపీ ఆర్‌డీ కె.కుమారవర్మ సూచించారు. శనివారం మండలంలోని కాశీపేట, అంటిపేట గ్రామాల్లో చేపట్టిన పారిశుద్ధ్య పనులను పరిశీలించిన ఆయన ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న కారణంగా వరద నిల్వ ప్రాంతాలు, మురుగు కాలువల్లో దోమలు ఎక్కువగా పెరిగే అవకాశం ఉందని, తద్వారా ప్రజలు మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి రోగాల బారినపడే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో పారిశుద్ధ్య పనులు పక్కాగా నిర్వహించాలని, గ్రామస్తులు కూడా వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. ఆయన వెంట కార్యదర్శులు మురళి, శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన బోర్ల మరమ్మతులు



పాడైన తాగునీటి బోరును బాగు చేస్తున్న మెకానిక్‌లు

సీతానగరం: మండల వ్యాప్తంగా తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ మెకానిక్ సత్యంనాయుడు తెలిపారు. శనివారం మండలంలోని కె.ఎస్.పురంలో సర్పంచ్ యు.జయలక్ష్మి, ఎంపీటీసీ వై.అరుణకుమారి ఆధ్వర్యంలో తాగునీటి బోర్ల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపట్టి, నీటి సరఫరాను పునరుద్ధరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న వివిధ ప్రాంతాల పాడైన బోర్ల జాబితా ఆధారంగా ఇద్దరు మెకానిక్‌లు ఆయా ప్రాంతాలకు వెళ్లి, బాగుచేస్తుండడం జరుగుతోందన్నారు. బోరు పనిచేయడం లేదన్న విషయం తెలిసిన 24 గంటల్లో అక్కడికి వెళ్లి, బోరు బాగు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మెకానిక్‌లు వి.కృష్ణ, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పాఠశాలల్లో హాజరు శాతం పెంచేందుకు కృషి

సీతానగరం: పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులను ఎంఈఓ-2 ఎం.వెంకటరమణ కోరారు. శనివారం మండలంలోని జోగింపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన అక్కడి మౌలిక సదుపాయాలు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, విద్యార్థుల విద్యాప్రగతికి తీసుకుంటున్న చర్యలు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, ప్రతీ విద్యార్థి విద్యాప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. చదువులో వెనకబడ్డ విద్యార్థి విద్యాప్రగతి సాధించేలా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే డ్రాపౌట్స్ ఉండకుండా, విద్యార్థులు రోజూ పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు.

బీజేపురం పాఠశాల తనిఖీ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈఓలు

జియ్యమ్మవలస: మండలంలోని బీజేపురం ఎంపీపీ పాఠశాలను ఎంఈఓలు నాగభూషణరావు, శ్రీనివాసరావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. బోధన, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై హెచ్‌ఎం, ఉపాధ్యాయుల నుంచి వివరాలు సేకరించారు. మెనూ ప్రకారం భోజనాలు వండిపెట్టాలని సూచించారు.

మిస్సింగ్ కేసు నమోదు



బిడ్డిక లచ్చుమయ్య

భామిని: మండలం బత్తిలి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు మిస్సింగ్ కేసులు నమోదైనట్లు ఎస్సై యతిరాజుల అమ్మనరావు శనివారం తెలిపారు. భామిని గ్రామానికి చెందిన బిడ్డిక లచ్చుమయ్య(80) మతిస్థిమితం లేక పోవడంతో ఎటో వెళ్లిపోయినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు. అలాగే సామర్లకోటకు చెందిన సోమాల రత్నంరాజు(25) ఉపాధి నిమిత్తం భామిని వచ్చి కొద్దిరోజులుగా జాడ లేకుండా పోయాడని ఫిర్యాదు అందినట్లు చెప్పారు. వారి ఫొటోలను విడుదల చేశారు. ఎవరికైనా వారి ఆచూకీ తెలిస్తే ఎస్సై ఫోన్ 6309990884కు సమాచారం ఇవ్వాలని కోరారు.

‘జగనన్న సురక్ష’తో ప్రజలకు మేలు

గ్రామ గ్రామాన ఓ యజ్ఞంలా జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతోంది. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు, పథకాలపై ఆరాతీసి, అవి వారికి అందేలా చర్యలు చేపడుతున్నారు. దీంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోంది. శనివారం పలువురి ఇళ్ల వద్దకే వెళ్లి, జనన, మరణ, కుల, ఆదాయం వంటి 11 రకాల ధ్రువపత్రాలను ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేకుండా అందజేశారు. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– పార్వతీపురం, సాలూరు సాక్షి నెట్‌వర్క్



సీతానగరం: జోగింపేటలో అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు



కాశీపేటలో రైస్‌కార్డులు అందిస్తున్న తహసీల్దార్ రమణ, సర్పంచ్ ధనంజయమ్మ



సాలూరు: కరాసవలసలో ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



బలిజిపేట: అరసాడలో తాము అందుకున్న ధ్రువపత్రాలు చూపిస్తున్న అర్జీదారులు

పెదంకలాం కాలువ నుంచి సాగునీరు విడుదల



కాలువ గేటు ఎత్తి, సాగునీరు విడుదల చేస్తున్న ఎంపీపీ నాగమణి, తదితరులు

బలిజిపేట: మండలంలోని పెదంకలాం కాలువ నుంచి సాగునీటిని శనివారం విడుదల చేశారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదేశాల మేరకు ఎంపీపీ నాగమణి కాలువ గేటును ఎత్తి, నీటిని విడుదల చేశారు. రైతులకు సాగునీటి సమస్యలు లేకుండా కాలువ శివారు వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకున్నట్లు ఆమె తెలిపారు. కాలువ ఆయకట్టు 10 వేల ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందేలా చూడాలని, ఆమె అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, సర్పంచ్ ఆర్.శ్రీనివాసరావు, వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కళ్ల కలకలపై అప్రమత్తం



విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అరుణ్‌కుమార్

కొమరాడ: మండలంలోని కోటిపాం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కొమరాడ పీహెచ్‌సీ వైద్యులు సీహెచ్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సీజనల్‌లో ప్రధానంగా కళ్ల కలకలు ఎక్కువగా ఉన్నందున విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యాధి సోకిన వారు ఇంటి వద్దే విశ్రాంతి తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన, వడపోసిన నీటిని తాగాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.

జగనన్న పాలనలో గడపగడపకూ సంక్షేమం

• ఎమ్మెల్యే కళావతి



చిన్నబగ్గలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: పార్టీలకు అతీతంగా.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని చిన్నబగ్గలో శనివారం ‘గడపగడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు మహిళలు అడుగడుగునా హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం పార్టీ నాయకులు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని తెలియజేస్తూ బుక్‌లెట్లు అందజేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు.

పథకాలు పొందేందుకు ఎలాంటి సిఫార్సులు అవసరం లేదని, దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత గడువులోగా పథకాలు ఇంటి వద్దకే తీసుకువచ్చి అందించడం జరుగుతుందన్నారు. ‘గడపగడపకు మన ప్రభుత్వం’ పూర్తయిన గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం రూ.40 లక్షలు చొప్పున మంజూరు చేస్తోందని, ఆ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు.

అగ్నివీర్ మాక్ ట్రయల్ రన్



ట్రయల్ రన్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ చింత శారద తదితరులు

బొబ్బిలి: భారత సైన్యం ఎంపిక కోసం నిర్వహించే అగ్నివీర్ ఎంపికల కోసం వెళ్లనున్న విద్యార్థులు, యువతకు మాక్ ట్రయల్ పరుగు పందెం నిర్వహించారు. స్థానిక వీర బొబ్బిలి క్రీడా ప్రాంగణంలో స్పోర్ట్స్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షుడు రావు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 1600 మీటర్ల పరుగు పందెం శనివారం నిర్వహించారు. దీనిని అభ్యుదయ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింత శారద జెండా ఊపి ప్రారంభించారు. పరుగు పందెంలో మొదటి ఐదుగురికి రాజా రమేష్ చౌదరి బహుమతులు అందజేశారు. తిరుపతిరావు, ఎస్.నాగేంద్ర పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

• జిల్లా అదనపు జడ్జి దామోదరరావు

కొమరాడ: ర్యాగింగ్ చట్ట విరుద్ధమని, ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలు పాడుచేసుకోవద్దని జిల్లా అడిషనల్ జడ్జి డి.దామోదరరావు అన్నారు. మండలంలోని స్థానిక జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వై.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి న్యాయమూర్తి మాట్లాడారు. సత్ప్రవర్తనతో మెలగాలని, చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలిని, కళాశాలతో పాటు అధ్యాపకులకు, తల్లిదండ్రులకు పేరుప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. తరగతి గదిలో విద్యార్థినులను సోదర భావంతో చూడాలే తప్ప, ర్యాగింగ్ పేరుతో వారితో అసభ్యకరంగా ప్రవర్తించడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి దామోదరరావు

‘జగనన్న సురక్ష’తో మరింత సంక్షేమం

ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన ‘జగనన్న సురక్ష’ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా ప్రజలకు వివిధ రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందజేస్తున్నారు. అర్హత ఉండి సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు పొందని వారికి ‘జగనన్న సురక్ష’తో ఎంతో మేలు జరుగుతుంది.



పాలకొండ: అర్జీదారుకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

పాలకొండ: పట్టణంలోని 15,16 వార్డుల్లో శనివారం నిర్వహించిన ‘జగనన్న సురక్ష’ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొని లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించే అవకాశం ఉందన్నారు. నగరపంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు, కౌన్సిలర్లు కడగల రమణ, తుమ్మగుంట శంకరరావు, వైస్ చైర్మన్‌లు రౌతు హనుమంతురావు, పల్లా ప్రతాప్, వెలమల మన్మథరావు, కనపాక సూర్యప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అన్నారు. మండలంలోని తాళ్లడుమ్మలో శనివారం నిర్వహించిన ‘జగనన్న సురక్ష’ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హత ఉన్నప్పటికీ సాంకేతిక కారణాలతో ఎవరైనా పథకాలు పొందలేనివారికి జగనన్న సురక్షతో పథకాలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ సీతారామయ్య, ఎంపీటీసీ రెడ్డి రవికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని చిదిమి గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు పాల్గొని 180 మందికి వివిధ ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. అలాగే నడుకూరులో జరిగిన కార్యక్రమంలో 155 మంది లబ్ధిదారులకు వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దమలపాటి ఉమామహేశ్వరరావు, కర్రి రమాదేవి, తహసీల్దార్ చందక సత్యనారాయణ, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, ఈఓపీ ఆర్డీ వి.రామచంద్రరావు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించటమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని బుక్కూరు సర్పంచ్ టొంపల సుందరమ్మ, ఎంపీటీసీ పిన్నిటి లక్ష్మి అన్నారు. గ్రామంలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 223 మంది అర్జీదారులకు కుల, ఆదాయ, భూ సంబధిత ధ్రువపత్రాలను అందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వంజరాపు కొండలరావు, డిప్యూటీ తహసీల్దార్ బొమ్మలాట బుచ్చయ్య, ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భామిని: మండలం కోసలి, సులకజోడు సచివాలయాల పరిధిలో ఎంపీడీఓ జీ చంద్రరావు, తహసీల్దార్ ఎస్.అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, జేసీఎస్ సీఓ కె.చంద్రశేఖర్, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు ఎం.మోహనబాబు, బొడ్డేపల్లి ప్రసాద్, తదితరులు పాల్గొని అర్జీదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలు అందజేశారు.

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలస సచివాలయం పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామారావు పాల్గొని అర్జీదారులకు వివిధ ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీవీ జనార్దన్, ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: ప్రజలకు అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలనూ వెంటనే ఉచితంగా అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎంపీపీ కుంబురుక దీనమయ్య అన్నారు. ఎల్విన్‌పేట సచివాలయం-1లో తహసీల్దార్ జే.రాములమ్మ ఆధ్వర్యంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీతో పాటు సర్పంచ్ ఆర్.చైతన్య స్రవంతి, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు తోయక గోపాల్ పలువురు అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కొండవాడలో ఎంపీడీఓ ఎస్.పాల్మన్‌రాజు, సర్పంచ్ కృష్ణారావు లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు.

‘ఫ్యామిలీ డాక్టర్’తో ఇంటి వద్దకే వైద్యసేవలు



చిన్నారి ఆరోగ్యం తనిఖీ చేస్తున్న వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి

బలిజిపేట: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ఇంటింటికీ వైద్యసేవలు అందున్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి కోరారు. మండలంలోని అంపావల్లి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. వైద్య శిబిరం వద్దకు వచ్చిన దాదాపు 65 మందికి ఆమె ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి, మంచానపడి ఉన్న రోగుల బాగోగులపై ఆరాతీసి, వారికి వైద్యసేవలందించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు వెళ్లి, అక్కడి పిల్లల ఆరోగ్యం పరిశీలించారు. మెరుగైన ఆరోగ్య సాధనకు పాటించాల్సిన సూత్రాలు తెలియజేశారు. ప్రతిరోజూ తినే ఆహారంలో క్రమం తప్పకుండా పౌష్టికాహారం ఉండేలా చూసుకోవాలన్నారు. ఇల్లు, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎస్.వి. రమణ, ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐటీడీఏ పీఓ అభినందనలు



ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

పార్వతీపురం: ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ తన కార్యాలయంలో శనివారం అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాగా చదివి, ఉన్నత స్థాయి చేరుకోవాలన్న ఆకాంక్ష బలంగా ఉంటే తప్పకుండా ఆ స్థాయిని మనం చేరుకుంటామని తెలిపారు. విద్యార్థులు ఇష్టంతో చదువుకోవాలని, తల్లిదండ్రులకు మంచిపేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. అనంతరం ఆయన తన కార్యాలయంలో నిర్వహించిన ఇంజినీరింగ్ అధికారుల సమీక్ష సమావేశంలో వర్షాల కారణంగా అభివృద్ధి పనులు ఆలస్యమయ్యే అవకాశం ఉంటుందని, వర్షాలు లేని సమయంలోనే వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని తెలిపారు.

చురుగ్గా జగనన్న సురక్ష సర్వే



అప్పయ్యపేటలో జగనన్న సురక్ష సర్వే చేస్తున్న వలంటీర్లు పక్కనే సచివాలయ కన్వీనర్ సూర్యనారాయణ

సీతానగరం: మండలంలోని పెదబోగిలి పంచాయతీ, అప్పయ్యపేట కాలనీలో జగనన్న సురక్ష కార్యక్రమం సర్వే శనివారం నిర్వహించారు. పెదబోగిలి సచివాలయ కన్వీనర్ బి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లిన వలంటీర్లు ప్రభుత్వ పథకాల అర్హుల జాబితాతో పాటు ప్రభుత్వం కల్పిస్తున్న 11 రకాల సిటిజన్ సర్వీసులు కావాల్సిన వారి వివరాలను సేకరించారు. త్వరలో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ప్రజలకు కావాల్సిన పథకాలు, సర్వీసులు అందజేయడం జరుగుతుందని, ఈ సదుపాయాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సచివాలయ కన్వీనర్ కోరారు.

కార్యక్రమంలో మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు బషీర్ ఖాన్, ఎంపీటీసీ బి.కుసుమ తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధిపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయాధికారి శంకరరావు

కొమరాడ: రైతులు సొంతంగా విత్తనాలు తయారు చేసుకోవడంతో పాటు వాటిని శుద్ధి చేసుకుని నిల్వ చేసుకోవాలని జిల్లా రైతు శిక్షణ అధికారి ఆర్.శ్రీనివాసరావు అన్నారు. గ్రామీణ విత్తనాభివృద్ధి పథకంలో భాగంగా మండలంలోని గుణాపురం గ్రామంలో శనివారం రైతులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. కిలో విత్తనశుద్ధి కోసం సూడోమోనస్, ఫ్లొరెసెన్స్ అనే జీవశిలీంధ్ర నాశిని 8 గ్రాములు కలపాలన్నారు. నారు మడిలో జింకులోపం ఉంటే జింక్ సల్ఫేట్ లీటరకు రెండు గ్రాములు పిచికారీ చేయాలని సూచించారు. అలాగే ఉభాలు వేసే ప్రధాన మడిలో పదిరోజుల ముందే ఒక కేజీ వరకు కార్బోఫ్యూరెన్ గుళికలను వేసుకుంటే 40 రోజుల వరకు ఎలాంటి చీడపీడలు రాకుండా కాపాడుకోవచ్చన్నారు. పొటాష్ ఎరువు సమయానుగుణంగా రెండుసార్లు వేస్తే మంచి దిగుబడులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.శంకరరావు, సర్పంచ్ ఎం.పద్మావతి, సచివాలయ వ్యవసాయ సహాయకులు ఎల్.భావన తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్ పుల్లి రత్నకుమారి, W/o కామరాజు గుప్తా (రాజా) యిచ్చిన భోగట్టా అధికారంతో ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని నా క్లయింటు పుల్లి రత్న కుమారి గారు క్రయపురోణి మూలకంగా కోట శ్రీనివాసరావు S/o లేటు సాంబమూర్తి, సాలూరు వద్ద నుండి కొనుక్కొని యున్నారు. నా క్లయింటు సదరు కోట శ్రీనివాసరావుని షెడ్యూలు ఆస్తిని రిజిస్టరీ చేయమని ఎన్నిమార్లు కోరినను సదరు కోట శ్రీనివాసరావు కాలయాపన చేస్తున్నందున నా క్లయింటు మహారాజ శ్రీ సాలూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో O.S.93/2023 నెంబరు గల దావాను పైలు చేసి యున్నారు. సదరు దావా ప్రస్తుతము పెండింగుగా యుంది.

కావున దావా పూర్తి అయ్యే వరకు సదరు షెడ్యూలు ఆస్తిని వేరే ఎవరు క్రయవిక్రయాలు జరిపించరాదని, ఒకవేళ క్రయవిక్రయాలు సదరు ఆస్తిపై జరిపించిన ఎడల అవి చెల్లవని యిందుమూలకంగా హెచ్చరించడమైనది.

షెడ్యూలు : జిల్లా : పార్వతీపురం, సబ్ - రిజిస్ట్రార్ : సాలూరు, మండలం / మునిసిపాలిటీ : సాలూరు, కోటకోట వీధి, డోర్ నెంబరు 17-70, అసెస్మెంటు నెం : 1092003475, ఆస్తి స్వభావం : శ్లాబ్ యిల్లు, పొడవు : 75 అడుగులు, వెడల్పు 12 1/2 అడుగులు.

హద్దులు : 1. తూర్పు : కోట సూర్యారావు యిల్లు, 2. దక్షిణకు : రోడ్, 3. పడమర : పసుపులేటి నానాజీ యిల్లు, 4. ఉత్తర కు రావాడ శ్రీనివాసరావు స్థలం.

సం/- టీక్స్ మురళీకృష్ణ
సీనియర్ అడ్వకేట్ & నోటరీ
సాలూరు, ఫోన్ : 9441612123